క్లుప్తంగా

ముక్కంటి సేవలో జెడ్పీ సీఈఓ



శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శుక్రవారం ఉమ్మడి చిత్తూరు జిల్లా జెడ్పీ సీఈవో పి.ప్రభాకర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆయనను ఆశీర్వదించారు. శ్రీస్వామి,అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

ఫ్లెక్సీ ధ్వంసం చేశారని ఫిర్యాదు



బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ఫ్లెక్సీని టీడీపీకి చెందిన వారు చించేశారని శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. వైఎస్సార్‌సీపీ యూత్ నాయకులు నరేష్, పాపయ్య, రమేష్, మునస్వామి, మహేష్, సాయి, కేశవులు, వినోద్ ఈ మేరకు ఫిర్యాదు చేశారు. జనవరి ఫస్టున వైఎస్సార్‌సీపీ నాయకుల ఫొటోలతో శుభాకాంక్షల ఫ్లెక్సీని ఏర్పాటు చేయగా, గురువారం రాత్రి టీడీపీ వారు చించేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

నాణ్యతగా మధ్యాహ్న భోజనం



బుచ్చినాయుడుకండ్రిగ: ప్రభుత్వ పాఠశాలలో జగనన్న గోరుముద్ద పథకం కింద మధ్యాహ్న పథకంలో రుచికరమైన భోజనాన్ని పెట్టాలని వంట నిర్వాహకులకు ఎంపీడీఓ సాయిలహరి సూచించారు. శుక్రవారం వెస్టువరత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలును ఎంపీడీఓ పరిశీలించారు. పదార్థాల రుచి చూశారు. ఆమె మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తెలిపారు. ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

కేవీబీపురం: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తహసీల్దార్ శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ సోమవారం నుంచి కార్యాలయం బయటే స్పందన నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న స్పందనలో వస్తున్న అర్జీలపై సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదులు అందడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతంలో ఇచ్చిన అర్జీలు ఇచ్చి సమస్య పరిష్కారం కాకుండా ఉంటే ఈ సోమవారం అందజేయాలని సూచించారు. గతంలో వచ్చిన అర్జీలు తన వరకూ రాకుండా ఎలా మాయమయ్యాయో అన్న విషయాన్ని అక్కడే ప్రజలు, సంబంధిత అధికారులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి విచారిస్తామని ఆమె స్పష్టం చేశారు.

ప్రమాద బీమా అందజేత



శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న భవన నిర్మాణ కార్మికుడు గంగాధర్‌కు ఎంఎస్ లైఫ్ స్టీల్ సంస్థ శుక్రవారం రూ.30 వేల ప్రమాద బీమా అందజేసింది. తొట్టంబేడు మండలం శేషమనాయుడుకండ్రిగ గ్రామానికి చెందిన గంగాధర్ 30 ఏళ్లుగా తాపీ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. ఆరునెలల కిందట బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఒక కాలు కోల్పోయాడు. ఎంఎస్ లైఫ్ సంస్థ ప్రతినిధులు, స్థానిక హిందూస్థాన్ స్టీల్ అండ్ సిమెంట్ డీలరు ఇలియాస్‌బాబు ఆయనకు చెక్కును అందజేశారు.

నేటి నుంచి ఉపాధి గ్రామ సభలు

నారాయణవనం: సామాజిక తనిఖీల్లో భాగంగా శనివారం నుంచి మండలంలో మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కృష్ణమూర్తి తెలిపారు. షెడ్యూల్ మేరకు సర్పంచ్‌ల అధ్యక్షతన సమావేశాలను నిర్వహించి పంచాయతీ స్థాయిలో గత ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనులపై బహిరంగ విచారణ, లెక్కల తనిఖీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశాలకు ఉపాధి కూలీలు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలన్నారు.

అవ్వాతాతల ఆనందమే లక్ష్యం

బుచ్చినాయుడుకండ్రిగ: అవ్వాతాతల ఆనందమే లక్ష్యంగా అర్హులందరికీ ప్రభుత్వం పింఛన్లు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే కోనేటిఆదిమూలం తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలానికి కొత్తగా మంజూరైన 62 పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో జన్మభూమి కమిటీలు తమకు అనుకూలమైన వారికే పింఛన్లు మంజూరు చేసేవారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రాగానే అర్హతే ప్రమాణికంగా పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. వలంటీర్ల ద్వారా నేరుగా వారి ఇంటి వద్దకే ఒకటో తేదీనే పింఛన్ సొమ్ము పంపిణీ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అరణి విద్యానాథరెడ్డి, ఎంపీపీ సుబ్బలక్ష్మి, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మణినాయుడు, నాయకులు అజయ్‌కుమార్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, హరిప్రసాద్, సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా, ఎంపీడీఓ సాయిలహరి, తహసీల్దార్ భార్గవి, ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



వరదయ్యపాళెం: పింఛన్ నగదు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం



బీఎన్‌కండ్రిగ: వెస్టువరత్తూరులో సచివాలయ భవనం ప్రారంభంలో ఎమ్మెల్యే ఆదిమూలం

పెరటికోళ్ల పంపిణీ

మండల మహిళ సమాఖ్య సభ్యులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పెరటికోళ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకంతో మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలన్నారు.

క్రీడాకారులకు టీ షర్ట్స్

ఆడుదాం-ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం టీ షర్టులు, క్యాప్‌లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాలను వెలికి తీసేందుకే ఆడుదాం-ఆంధ్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వైఎస్సార్ క్లినిక్, సచివాలయాల భవనాలు ప్రారంభం

మండలంలోని ఆర్‌అనంతాపురం గ్రామంలో రూ.20 లక్షల 80 వేలతో నిర్మించిన వైఎస్‌ఆర్ క్లినిక్ భవనం, వెస్టువరత్తూరు గ్రామంలో రూ.35 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు.

అవ్వాతాతలకు అండగా సీఎం జగన్

వరదయ్యపాళెం: రాష్ట్రంలో పింఛన్‌దారుల ఆత్మ గౌరవాన్ని కాపాడుతూ రూ.3వేలు పింఛన్‌ను దేశంలోనే ఎక్కడా లేనివిధంగా అందిస్తున్న మనసున్న మారాజు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం వరదయ్యపాళెం ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో వైఎస్సార్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలో నూతనంగా మంజూరైన 125 పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్క వరదయ్యపాళెం మండలంలోనే నూతనంగా మంజూరైన పింఛన్లతో పాటు నెలకు 6,539 మంది పింఛన్లను అందుకుంటున్నారని, వారికి రూ.1.92కోట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అది కూడా ఒకటో తారీఖు తెల్లవారుజామునే తలుపు తట్టి వలంటీర్లు అందజేస్తున్నారన్నారు. 2014 ఎన్నికల్లో 600 హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒక్కటి కూడా అమలు చేయలేదని, రానున్న ఎన్నికల్లో అనేక పార్టీలతో జతకట్టి ప్రజలను మరోసారి మోసం చేయడానికి అనేక హామీలను ఇస్తున్నారని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎంపీడీఓ సుబ్రమణ్యం రాజు, తహసీల్దార్ గౌరీశంకరరావు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, వైస్ ఎంపీపీలు పద్మావతి, శ్యామలమ్మ, మార్కెటింగ్ కమిటీ ఉపాధ్యక్షుడు పాల సుబ్రమణ్యం రెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, వినోద్ యాదవ్, బందిల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం



పిచ్చాటూరు: జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు: గ్రామీణ పేద ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష వరమని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. శుక్రవారం మండలంలోని ముడియూరు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలిరోజు శిబిరంలో చిన్నపిల్లల స్పెషలిస్ట్ డాక్టర్ భార్గవ్, జనరల్ సర్జన్ డాక్టర్ పూజ, పీహెచ్‌సీ డాక్టర్ హమీద్, మునిచరిత్ర సచివాలయం పరిధిలోని 304 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు మంపిణీ చేశారు. కంటి సమస్య ఉన్న వారికి అద్దాలను పంపిణీ చేశారు. సర్పంచ్ శ్యామల, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దారు మధుసూదన్‌రావు, ఎంఈఓ యుగంధర్ రాజు, వైఎస్‌ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు కె.వెంకటచలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు, మాజీ మండల అధ్యక్షుడు పాలపద్మనాభం, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి గజేంద్ర, పార్టీ మండల ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం సేవలే లక్ష్యం

సత్యవేడు: గ్రామాల్లో జగనన్న ఆరోగ సురక్ష వైద్య కేంద్రాల ద్వారా పేదలకు మెరుగైన వైద్యసేవలు అందుతోందని సురుటుపల్లి ఆలయ చైర్మన్ ఏవీఎం. బాలాజీ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆంబాకం పంచాయతీ పుదుకుప్పం జెడ్పీ హైస్కూల్ ఆవరణలోఎంపీటీసీ సభ్యుడు శరవణ అధ్యక్షన ఎంపీడీఓ చంద్రశేఖర్ పర్యవేక్షణలో జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమం నిర్వహించారు. శరవణ, బాలాజీ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ముంగిటకే వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం రెండో విడత వైద్య శిబిరాలకు శ్రీకారం చుట్టిందన్నారు. వైఎస్సార్ కంటివెలుగు కార్యక్రమంలో భాగంగా18 మందికి కంటిపరీక్షలు నిర్వహించారు. పది మందికి అద్దాలు అందజేశారు, చిన్నపిల్లల వైద్యనిపుణులు స్పందన(తిరుపతి), జనరల్ మెడిసిన్ శ్రీకాంత్, దాసుకుప్పం పీహెచ్‌సీ డాక్టర్ గుణశేఖర్ కలసి 303 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఎంపీహెచ్ఈఓ సుబ్రమణ్యం, ఎంఈఓ కె.రవి, ఫార్మసిస్టు భార్గవి, ఆరోగ్య పర్యవేక్షకులు నాగజ్యోతి, ఏఎన్ఎంలు లావణ్య, స్వాతి, సుమలత, లతాదేవి, సరస్వి, ఇంద్రాణి, ఆశా వర్కర్లు లలిత, విజయనిర్మల రేవతి, మునికుమారి తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: వరదయ్యపాళెం-2 సచివాలయ పరిధిలో శుక్రవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అధికారులు, ప్రజాప్రతినిధులు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సచివాలయాల పరిధిలో శిబిరాలు ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా 380 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేసినట్లు వైద్యాధికారి ఉదయ్‌కుమార్ తెలిపారు. ప్రత్యేక వైద్యులు భాగ్యలక్ష్మి, చంద్ర, ద్వైత సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సర్పంచ్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



సత్యవేడు: రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి స్పందన



వరదయ్యపాళెం : మందులు అందజేస్తున్న వైద్య సిబ్బంది

ఆల్ ఇండియా సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



మాట్లాడుతున్న డాక్టర్ చంద్రశేఖర్, వేదికపై పవిత్రారెడ్డి

రేణిగుంట(శ్రీకాళహస్తి) : పట్టణంలో విక్రమ్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆల్ ఇండియా సీనియర్ నేషనల్ టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ క్రీడలను డాక్టర్ చంద్రశేఖర్ పర్యవేక్షిస్తున్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్రారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. శ్రీకాళహస్తిలో ఇలాంటి టెన్నిస్ పోటీలు నిర్వహించడం చా లా ఆనందంగా ఉందన్నారు. 70 సంవత్సరాలు పైబడిన వారు పోటీల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్, విశ్రాంత న్యాయమూర్తి రామకృష్ణ, డీఎస్ఎన్ రాజు, దశరథ, దామోదరం, మన్మథరావు, రవి, ధనుంజయులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు రూ.50 లక్షలు

నాగలాపురం: ఎమ్మెల్యే ఆదిమూలం చొరవతో నాగలాపురం నుంచి టీపీకోట వరకు 15 కిలో మీటర్ల రోడ్డు మరమ్మతులకు రూ. 50 లక్షల నిధులు మంజూరైనట్లు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు తెలిపారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ త్వరలో టెండర్లు పిలిచి అధికారులు పనులు ప్రారంభించనున్నారని పేర్కొన్నారు. సమావేశంలో సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధూ శ్యామ్, ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ఎం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

లఖ్‌పతి దీదీ యోజనపై అవగాహన

నారాయణవనం: మహిళల ఆర్థిక సాధికారికతకు కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న లఖ్‌పతిదీదీ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు తెలిపారు. శుక్రవారం కమ్యూనిటీ భవనంలో డ్వాక్రా మహిళలు, సంఘ మిత్రలతో సమావేశాన్ని నిర్వహించారు. జెడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరచుకునేందుకు మహిళలు ఆర్థికంగా ఎదగాలని అన్నారు. ఇప్పటికే డ్వాక్రా సంఘ సభ్యులకు బ్యాంకుల ద్వారా రూ.2 లక్షల వరకు రుణాలుగా అందుతోందని అన్నారు. ఏపీఎం మమత మాట్లాడుతూ లఖ్‌పతి దీదీ పథకం కింద బ్యాంకుల నుంచి ఒక్కో మహిళా సభ్యురాలు రూ.లక్ష వరకు రుణాన్ని పొందవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏవో గుణశేఖర్, వెలుగు సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం మమత

పంటల సస్యరక్షణపై అవగాహన

నాగలాపురం: స్థానిక టీఆర్ఆర్ కల్యాణ మండపంలో శుక్రవారం పంటల సస్యరక్షణపై స్పిక్ కంపెనీ రీజనల్ ఆఫీసర్ సి.గంగాధరం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తిరుపతి జిల్లా డీఏఓ ఎస్.ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రొజెక్టర్ ద్వారా వరి, వేరు శెనగ, చెరుకు, మామిడి, పూలతోటల పెంపకంపై ఎరువులు, మందులు పిచికారీ, యాజమాన్య పద్ధతులను వివరించారు. 300 మంది పైగా రైతులు హాజరయ్యారు. రాస్ కేవీకే ప్రిన్సిపల్,శాస్త్రవేత్త శ్రీనివాసులు, తిరుపతి డీఏఓ ధనుంజయ రెడ్డి, స్టేట్ మార్కెటింగ్ మేనేజర్ పి.శివకుమార్, ఏఓ సుబ్బరావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధా తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి స్థలం కేటాయించాలని వినతి




మాట్లాడుతున్న ముస్లిం మైనారిటీ నేతలు

వరదయ్యపాళెం: మండలంలోని గోపాలరావుకాలనీ ముస్లింలకు శ్మశాన స్థలాన్ని కేటాయించాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులతో కలసి ముస్లిం మైనారిటీ నాయకులు జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్, కార్యదర్శి లతీఫ్ శుక్రవారం తహసీల్దార్‌కు విన్నవించారు. ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశాన స్థల విషయమై పలుమార్లు విన్నవించినా స్పందన లేదని వాపోయారు. గతంలో గడపగడపకు మన ప్రభు త్వం కార్యక్రమంలో గోపాలరావుకాలనీకి వచ్చిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంకు సమస్యను విన్నవించడంతో, స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారని తెలిపారు. అయినా ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. పార్టీ నాయకులు మాట్లాడుతూ.. వీలైనంత త్వరగా శ్మశానానికి స్థలం చూపించమని కోరారు. స్పందించిన తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి స్థలం కేటాయించేందుకు చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, మండల పార్టీ కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, జిల్లా కార్యదర్శి బందిల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 20 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 59,522 మంది స్వామివారిని దర్శించుకోగా 18,544 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.51 కోట్లు సమర్పించారు. టికెట్లు లేని భక్తులకు దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



సత్యవేడు: పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో శుక్రవారం స్టేట్ టీచర్స్ యూనియన్ క్యాలెండర్, డైరీలను ఎంఈఓ కె.రవి, ఎంఈఓ2-ఉష శుక్రవారం ఆవిష్కరించారు. ఎస్టీయూ జిల్లా కార్యదర్శి కె. కోటీశ్వరం,అధ్యక్షుడు మునిరాజ, సెక్రటరీసురేష్, కోశాధికారి ఎస్.వెంకటేశులు కమిటీ సభ్యులు దామోదరం, ఎస్ గౌరీవరప్రసాద్, వేలాయుథం, మహేశ్వరి, కస్తూరి పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ నూతన కార్యవర్గం



మురుగేష్



గురుప్రసాద్



అమ్ములు

పిచ్చాటూరు: పీఆర్‌టీయూ మండల నూతన కార్యవర్గాన్ని శుక్రవారం రాష్ట్ర కార్యదర్శి టి.సదాశివన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడిగా మురుగేష్, ప్రధాన కార్యదర్శిగా గురుప్రసాద్, ఉపాధ్యక్షుడిగా జీవా, మహిళా అధ్యక్షురాలిగా అమ్ములు, జిల్లా కౌన్సిలర్‌గా షణ్ముగం, మహిళ కౌన్సిలర్‌గా వలర్మది, కోశాధికారిగా మీనాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్‌టీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌వీఎస్ బాబు సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న అంజూరు శ్రీనివాసులు

రేణిగుంట(శ్రీకాళహస్తి) : శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపోలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కడప జోనల్ వర్కింగ్ అధ్యక్షుడు ఎన్‌వీఎస్ బాబు సేవలు చిరస్మరణీయమని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. ఎన్‌వీఎస్ బాబు మొదటి వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం డిపో ఆవరణంలో ఘన నివాళులు అర్పించారు. శ్రీనివాసులు మాట్లాడుతూ యూనియన్ నాయకుడుగా బాబు కార్మికుల కోసం ఎంతో కృషి చేశారన్నారు. బాబు మొదటి వర్ధంతికి ఒకరోజు ముందు ఆయన కుమారుడికి కారుణ్య కింద ఉద్యోగం రావడం సంతోషకరమన్నారు. అనంతరం అన్నదానం చేశారు. డిపో మేనేజరు రాజవర్ధన్‌రెడ్డి, నాయకులు పసుపులేటి శ్రీనివాసకుమార్, ఆవుల ప్రభాకర్, జీపీఎస్ ఆచారి, టీఎం ఆచారి, కేసీ రెడ్డి, బీఎస్‌ఆర్ కుమార్, పీఎస్ ప్రసాద్, టీఎల్ మూర్తి, కుప్పయ్య, కుమార్ పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలి

తొట్టంబేడు(రేణిగుంట) : మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా ఎదగాలని ఎంపీడీవో సురేష్‌బాబు అన్నారు. తొట్టంబేడు మండల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం స్వయం సహాయక సంఘాల మహిళా సభ్యులకు పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వెలుగ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం ద్వారా వచ్చే మాంసం, గుడ్లు ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తహీనత, హనీమియా వంటి వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. పౌష్టికాహారంగా ఉపయోగపడుతుందని తెలిపారు. ఎక్కువ మోతాదులో కోళ్లను పెంచడం ద్వారా మాసం, గుడ్లు విక్రయం ద్వారా లాభాలు ఆర్జించే వీలు కలుగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా 60 యూనిట్ల పెరటి కోళ్లను మహిళా సభ్యులకు పంపిణీ చేశారు. ఏరియా కోఆర్డినేటర్ ధనుంజయరెడ్డి, ఏపీఎం గురుమూర్తి, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు రేవతి, దుర్గ, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పురుషోత్తం, మంగయ్య, అకౌంటెంట్ సరిత పాల్గొన్నారు.




పెరటి కోళ్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో సురేష్‌బాబు

టీడీపీ ఆక్రమిత భూములపై ఆర్డీఓ ఆరా

- 3వ రోజుకు బలహీన వర్గాల దీక్షలు
- ఆందోళనకారులతో అధికారుల చర్చలు

కేవీబీపురం: రాజులకండ్రిగ పరిధిలోని టీడీపీ ఆక్రమిత భూములపై శ్రీకాళహస్తి ఆర్డీఓ శివశంకర్‌రెడ్డి మండల రెవెన్యూ అధికారులతో ఆరా తీశారు. టీడీపీ నేతల ఆక్రమించు భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన వారికి పంపిణీ చేయాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీలు చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి మూడో రోజుకు చేరాయి. డీటీ మునిరత్నం, ఏఎస్ఐ లోకనాథం ఆందోళనకారులతో చర్చించారు. వారి నుంచి వినతిపత్రాలు తీసుకున్నారు. దీక్షలు విరమించాలని కోరగా, తమకు న్యాయం జరిగేంత వరకు విరమించేది లేదని తే ల్చిచెప్పారు. వారు మాట్లాడుతూ రాజులకండ్రిగ పరిధిలోని సర్వే నంబర్ 388, 389, 390, 391లో ఉన్న ప్రభుత్వ భూములను పేదవర్గాలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే నంబర్‌లో 60 ఎకరాల భూములను స్థానిక టీడీపీ నేతలు ఆక్రమించుకుని నకిలీ పాసు పుస్తకాలు సృష్టించి బ్యాంకుల్లో తాకట్టు పెట్టి రుణాలు కూడా పొందారని ఆరోపించారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని, ఆభూములను సర్వే చేసి అర్హులకు పంచాలని కోరారు. ఆందోళన సమాచారం శ్రీకాళహస్తి ఆర్డీఓకు అందడంతో అధికారులను ఆరాదీశారు. 40 ఏళ్లుగా బడుగు బలహీన వర్గాల వారు సాగు చేసుకుంటున్న భూముల ఆక్రమణలపై తక్షణం స్పందించాలని ఆదేశించారు. 2014-2016లో టీడీపీ నేతలకు పట్టాలు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. టీడీపీ నేతలు ఆన్‌లైన్ ప్రకారం పొజిషన్‌లో లేరన్న విషయాన్ని అధికారుల ద్వారా తెలుసుకున్న ఆర్డీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పట్టాలను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ కలెక్టర్‌కు సిఫారసు చేస్తూ నివేదిక అందించాలని మండల అధికారులను ఆదేశించారని సమాచారం. కేవీబీపురం, రాజులకండ్రిగ, పోలినాయుడు కండ్రిగ, రాజులకండ్రిగ దళిత, గిరిజన ప్రజలు పాల్గొన్నారు.



ఆందోళన కారులతో మాట్లాడుతున్న రెవెన్యూ, పోలీసు అధికారులు